క్లుప్తంగా

వ్యాసరచనలో సాత్విక ప్రతిభ



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న హెచ్ఎం సుబ్రహ్మణ్యం

కంబాలచెరువు: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యోగభారతి యోగా సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కందుకూరి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.సాత్విక ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం శుక్రవారం ఆ విద్యార్థినికి మెమెంటో అందజేశారు. ఉపాధ్యాయులు విజయకుమారి, వి.అనూరాధ, వరహాగిరి కృష్ణమోహన్, రాజు, పరితోష్, వెంకటేశ్వరరావు, నరసింహం అభినందించారు.

నేక్ కార్యాలయంలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బొమ్మూరులోని నేక్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు 48 మంది హాజరయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ తెలిపారు. డీమార్ట్, మాక్స్ రిటైల్, బ్లూ ఓషన్ బయోటెక్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 48 మంది అభ్యర్థులకు ఐదుగురు ఎంపిక కాగా, మరో నలుగురిని తదుపరి దశకు అర్హత సాధించారన్నారు. ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు రాజ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

సకాలంలో పచ్చిరొట్ట విత్తనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలని రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానించింది. శుక్రవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. రబీ వరికోతల సమయంలో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసలు అందుబాటులో ఉంచాలని, ధాన్యం అమ్మిన సందర్భంలో రైతులకు హమాలీ చార్జీలు ఇంకా చెల్లించలేదని సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రాజమహేంద్రవరం సహాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి శాంతా ఆలివ్, విద్యుత్ ఏఈ మల్లికార్జునరావు, ఉద్యాన అధికారి సుధీర్, ఏఈవో పీటర్, వీఏఏలు దుర్గబాబు, ఎన్డీ శ్రీనివాస్, నాగబాబు పాల్గొన్నారు.

ఆలయాల పవిత్రతను కాపాడాలి



ధర్మకర్తల మండలి సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పాలకమండలి సభ్యులకు అభినందనలు

రాజమహేంద్రవరం సిటీ: మన ఆధ్యాత్మిక వారసత్వ సంపద అయిన ఆలయాల పవిత్రతను కాపాడటానికి ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన తాడి రజని, ద్వారకా తిరుమల ధర్మకర్తల మండలి సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన నాళం కృష్ణ వీర సుబ్బలక్ష్మి శుక్రవారం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ సీపీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతర పాలకమండలి సభ్యులను ఎమ్మెల్యే రాజా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

12న రాజమహేంద్రి ఆర్కెస్ట్రా వార్షికోత్సవం



మాట్లాడుతున్న జిత్‌మోహన్‌మిత్ర, దుర్గా ఫణికుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి ఆర్కెస్ట్రా 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు పాటల పోటీలు, సాయంత్రం ఆర్కెస్ట్రా కళాకారులతో నాడు నేడు సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్నీసుపేటలోని రాజమహేంద్రి ఆర్కెస్ట్రా ఆర్గనైజర్ ఎం.దుర్గాఫణికుమార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన, నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో సినిమా పాటలు, లలిత గీతాలు, భక్తి గీతాల పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు 'నాడు నేడు' పేరిట రాజమహేంద్రి ఆర్కెస్ట్రా కళాకారులతో సంగీత విభావరి జరుగుతుందన్నారు. పాటల పోటీలో పాల్గొనే వారు 98491 98900, 70365 27411 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో పట్నాల శ్రీనివాస్, జి.రత్నరాజ్, డబ్ల్యూఎస్ఎస్‌సీ కౌశిక్, ఎస్.శివ, ఒంపోలు గోపాలకృష్ణ, ఎం.పెదబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

సీటీఆర్ఐ: రాష్ట్ర దేవాలయాల పాలక మండలిలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చిట్టాబత్తుల నాగబాబు, గౌరవ అధ్యక్షుడు అందనాపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. నాగబాబు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగన్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు ఇలాంటి గౌరవం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాలి రమేష్, పొన్నాడ గంగాధర్, ఉప్పాడి కన్నారావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ అభ్యున్నతి

సీటీఆర్ఐ: విద్యతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు, రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కనీసం ఐదో తరగతి వరకూ అన్ని పాఠశాలలను ప్రభుత్వమే నడపాలన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని, ఐదో తరగతి వరకూ ప్రభుత్వమే స్కూళ్లను నిర్వహించాలని కోరుతూ మేధావులు, విద్యావంతులతో త్వరలో నగరంలో ఒక సదస్సును నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జార్జి ఆంథోనీ, ఉపాధ్యక్షుడు బత్తిన ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

కడియం: రైతులు తమ పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం అన్నారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలం మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. నర్సరీ మొక్కలకు వ్యాపిస్తున్న తెల్లదోమను పంచగవ్య అనే మందు అడ్డుకుంటోందన్నారు. వీటిని ఆర్బీకేల వద్ద రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్బీకేల ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్ల నిమిత్తం రైతులను గ్రూప్‌లు ఏర్పాటు చేసి యంత్ర పరికరాలను అందజేస్తారన్నారు. సమావేశంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో కె.ద్వారకా దేవి, హెచ్‌వో సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాలను నియంత్రించాలి

ప్రకాశం నగర్: హైటెక్ బస్టాండ్ వద్ద రవాణా శాఖ అనుమతి పొందని ప్రైవేటు వాహనాలను నియంత్రించాలని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శుక్రవారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్, ఆర్టీసీ ఆర్ఎం, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించుకుని, ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్ట్స్ కళాశాల వద్ద ధర్నా

కంబాలచెరువు: విద్యా పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద శుక్రవారం నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా ధర్నా జరిగింది. ఏపీటీఎఫ్, పీడీఎస్‌యూ, డీటీఎఫ్, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పెల్లింగ్ పోటీలు



విజేతలతో యేలేటి రవిబాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం స్పెల్‌థాన్ 2022–23(స్పెల్లింగ్) పోటీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, భాషా నైపుణ్యం పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ స్పెల్ మాస్టర్, డీన్ హర్షిణిదేవి పోటీలు నిర్వహించారు. ఎం.ధృవ (ప్రథమ), ఎ.త్రిక్షిత(ద్వితీయ). ఎ.సాధిక(తృతీయ) విజేతలుగా నిలిచారు. చైర్‌పర్సన్ విజయ యేలేటి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాల్ సైదాబాను పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంబాలచెరువు: సంహిత డిగ్రీ కాలేజీ దగ్గరలోని రైల్వేట్రాక్ సమీపంలో ఈ నెల ఏడున సుమారు 30 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. స్థానికుల సాయంతో అతడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ప్రకాశం నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


15న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న ఆరు మోటారు సైకిళ్లు, ఒక ఆటోకు ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయం ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పాట దక్కించుకున్నవారు మొత్తాన్ని వెంటనే చెల్లించాలని, 18 శాతం జీఎస్టీ కట్టాలన్నారు. ఇతర వివరాలకు 91777 44055 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

16న మోటారు సైకిళ్ల వేలం

ధవళేశ్వరం: ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన మూడు మోటారు సైకిళ్లు ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి తెలిపారు. వీటిని వివిధ నేరాల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మోదీ సర్కారు మౌనం వీడాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రకాశం నగర్: అదానీ వ్యవహారంపై మోదీ సర్కార్ మౌనం విడిచి, దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కంబాలచెరువు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. మధు మాట్లాడుతూ వారం రోజులుగా పార్లమెంటు ఉభయ సభలు అదానీ వ్యవహారంపై స్తంభిస్తున్నా ప్రధాని నోరు మెదపలేదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, నగర కార్యవర్గ సభ్యులు నల్లా రామారావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం



హిమాన్సీకి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ప్రకాశం నగర్: చిత్రకారుడు హరి తాడోజు స్ట్రోకర్స్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ప్రముఖ నృత్యకారిణి హిమాన్సీ కాట్రగడ్డ, ప్రముఖ కవి, రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి కుమారుడు శ్రీయోగి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొత్తపల్లి అప్పాజీ, నాళం రామ్ కుమార్, పెండెం చంద్రశేఖర్, బండ్ల శంకర్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ పరిశీలన

కంబాలచెరువు: స్థానిక వై.జంక్షన్‌లోని బీసీ హాస్టల్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి సందర్శించారు. వసతి గృహ పరిసరాలు, వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. అక్కడ సౌకర్యాలపై విద్యార్థులను ఆరాతీశారు. విద్యార్థులకు మరింత రుచికరమైన భోజనం అందించాలన్నారు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని, మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు.

శివరాత్రి వేడుకలకు శ్రీకారం



కడియంలో రాటముహూర్తం చేస్తున్న భక్తులు

కడియం: స్థానిక భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శివరాత్రి వేడుకల ఏర్పాట్లకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పందిరి రాటను నాటి ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అప్పిలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దుళ్లలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం, వీరవరం, మురమండ గ్రామాల్లోని సోమేశ్వరాలయం, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయం, జేగురుపాడు నగరేశ్వరాలయం, వేమగిరి శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

జింక కళేబరానికి పోస్టుమార్టం



జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలో జింక కళేబరానికి అటవీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, దహనం చేశారు. గోదావరి లంకల్లో ఉండే జింకలు వివిధ కారణాలతో ఒడ్డుకు చేరుతున్నాయి. వాటిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇదే విధంగా కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను స్థానికులు గుర్తించారు. కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాణీకి విషయం తెలియజేయడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాజమహేంద్రవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శివప్రసాద్, బీట్ ఆఫీసర్ ఆనంద్ ఘటనా స్థలానికి వచ్చేసరికే జింక మృతి చెందింది. దీంతో వెటర్నరీ వైద్యులు కిరణ్, వీఆర్‌వో జ్యోతి సమక్షంలో జింక కళేబరానికి నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కళేబరాన్ని దహనం చేశారు.

కోనసీమ కొబ్బరిపై డాక్యుమెంటరీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కోనసీమ కొబ్బరి పరిశ్రమ గురించి కల్పవృక్షం పేరిట డాక్యుమెంటరీ తీస్తున్నట్లు దర్శక, నిర్మాత డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ తెలిపారు. జిత్ మోహన్ కళావేదిక దగ్గర శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొబ్బరి చెట్టు ద్వారా వచ్చే బొండాలు, కాయలు, ఇతర ఉత్పత్తులపై 20 నిమిషాల నిడివిలో డాక్యుమెంటరీ తీస్తున్నామన్నారు. రెండు రోజులపాటు చిత్రీకరణ ఉంటుందన్నారు. జిత్ మోహన్ మిత్రా, సినిమా విశ్లేషకులు ఎస్వీ రామారావు, కెమెరామెన్ భాస్కర్, ప్రొడక్షన్ ఆర్గనైజర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, వి.జగపతి, బీఎస్ఎన్ఎల్ మూర్తి, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు పాల్గొన్నారు.